క్లుప్తంగా

కబడ్డీ క్రీడాకారుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కబడ్డీ క్రీడాకారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు తురక గోపాలకృష్ణ ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం గ్రామంలోని వేణుగోపాల యూత్ కబడ్డీ క్రీడాకారులు గోపాలకృష్ణ కుటుంబసభ్యులకు రూ.20 వేల 500ల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల యూత్ కబడ్డీ క్రీడాకారులు, తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోదాడరూరల్ : కోదాడ మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

మోతెలో..

మోతె : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముప్పాని ఆశా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత మండల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు షూ పంపిణీ



షూ పంపిణీ చేస్తున్న సర్పంచ్ వాణి, దాత

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాత వల్లంశెట్ల లూనా తన తండ్రి వెంకటరాంప్రసాద్, తాత రాంమోహన్‌రావుల జ్ఞాపకార్థం సర్పంచ్ సుంకరి వాణి చేతుల మీదుగా విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యల్లబోయిన లింగయ్య, కనకదుర్గ ట్రస్ట్ చైర్మన్ వల్లంశెట్ల లచ్చయ్య, అరిబండి రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, విజయకుమారి, నాయకులు నాగరాజు, శ్రీధర్, హరిబాబు, సైదులు, రామకృష్ణ, ఉపాధ్యాయులు వీర్యా, శాంప్రసాద్, వెంకన్న తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



దిర్శించర్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్లలో జిల్లా పరిషత్ నిధులు రూ.7 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సైదులు, నాయకులు పంగ నాగరాజు, శ్రీను, వెంకటేశ్వర్లు, పున్నయ్య, మట్టారెడ్డి, యోగానందం, మహేష్, నగేష్, రామయ్య, వినోద్, రాంబాబు, అనిల్ తదిరులు ఉన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తుల జోలికి వస్తే ఊరుకోం



సమావేశంలో పాల్గొన్న ముస్లిం జేఏసీ సభ్యులు

హుజూర్‌నగర్ : వక్ఫ్‌బోర్డు ఆస్తుల జోలికి వస్తే ఊరుకునేది లేదని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఉస్మానియా మసీద్‌లో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నామనే భావనతో కొందరు ముస్లిం వక్ఫ్‌బోర్డు ఆస్తులలో జోక్యం చేసుకుని పెత్తనం చెలాయించడం సరైంది కాదని అన్నారు. తప్పుడు పత్రాలతో వక్ఫ్ ఆస్తులను దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్న మసీద్ కాంప్లెక్స్‌లోని దుకాణ కిరాయిదారు భూలక్ష్మీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. వక్ఫ్ బోర్డు ఆ దుకాణాన్ని స్వాధీనం చేసుకొని నోటిఫికేషన్ ద్వారా అర్హులైన ముస్లింలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అజీజ్ పాషా, ఎండీ నిజాముద్దీన్, మన్సూర్ అలీ, నవాబ్ జాని, అలీ, జిలానీ, గౌస్‌ఖాన్, బిక్కన్, ఇబ్రహీం, మజీద్, తదితరులు పాల్గొన్నారు.

సాధుతండాలో తాగునీటి కష్టాలు

- పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



సాధుతండాలో పొలాల వద్ద నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

మేళ్లచెరువు : వానాకాలం సగానికి వచ్చినా సరైన వానలు కురవకపోవడంతో ప్రజలకు తాగునీటి సమస్య తప్పడం లేదు. గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. మండలంలోని హేమ్లాతండా గ్రామపంచాయతీ పరిధిలోని సాధుతండాలో నీటి కటకట ఏర్పడి ప్రజలు అల్లాడుతున్నారు. దీంతో గ్రామ పరిధిలోని పొలాల వద్ద గల బావులు, బోర్ల నుంచి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. హేమ్లాతండాలో ఉన్న బోరు, బావుల్లో నీరు తక్కువగా ఉంది. దీనికి తోడు గ్రామపంచాయతీ బోర్లు మరమ్మతులకు గురైనా వాటిని రిపేరు చేయించలేదు. అంతేకాకుండా ఆ గ్రామంలో మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 150 కుటుంబాలు ఉన్న సాధుతండాలో నీటి బోర్లు మరమ్మతులకు గురైనా ప్రజాప్రతినిధులు పట్టించుకోడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌కు మోటారు బిగించకపోవడంతో ఇంటింటికి నల్లా ఉన్నా తాగు నీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదని వారు అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

మా తండాలో తాగునీటి మోటార్లకు మరమ్మతులు చేయించకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. నీటి కోసం పొలాల వద్ద బోరు బావులను ఆశ్రయిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

–ధారావత్ నాగమణి, సాధుతండా

మోటార్లు మరమ్మతులు చేయిస్తాం

సాధుతండాలో ఉన్న తాగు నీటి బోర్ల మోటార్లు కాలిపోయాయి. దీంతో గత వారం రోజులుగా తాగు నీటి సమస్య తలెత్తుతోంది. తక్షణమే మోటార్లు రిపేర్ చేయించి నీటి సమస్యను పరిష్కరిస్తాం.

–నాగేంద్రబాబు, కార్యదర్శి, హేమ్లాతండా

పేదల ఆత్మగౌరవానికి 'డబుల్ ఇళ్లు'

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



మోతెలో డబుల్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెం : బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మోతె : పేదలు ఆత్మగౌరవంగా బతికేందుకే ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మోతె మండల కేంద్రంలో ప్రభుత్వం రూ. 4 కోట్ల 53 లక్షల 60 వేలతో 60 మంది పేదలకు నిర్మించిన డబల్ బెడ్ రూం ఇళ్లను శుక్రవారం ఆయన ప్రారంభించి వారికి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ దుందుబీ మోగిస్తుందని దీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ వెంకటాచారి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు ఆరె లింగారెడ్డి, సొసైటీ చైర్మన్లు కొండపల్లి వెంకటరెడ్డి, ముప్పాని శ్రీధర్‌రెడ్డి, ఏలూరి వెంకటేశ్వరరావు, మద్ది మధుసుదన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

నడిగూడెం : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరంగాపురంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన రెడ్డిపల్లి రమేష్ (35) భార్య శైలజకు రెండు లక్షల రూపాయల బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కును శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 60 లక్షల సైన్యం ఉన్న పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లంజపల్లి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు గుర్వయ్య, మండల కమిటీ సభ్యుడు అనంతుల ఆంజనేయులు, గరిడేపల్లి సైదులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి తీరని లోటు

అనంతగిరి : అనంతగిరి మాజీ సర్పంచ్ కొత్తపల్లి వెంకటరత్నం మృతి పార్టీకి తీరని లోటని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం వెంకటరత్నం మృతదేహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ వేనేపల్లి వెంకటయ్య, శ్రీనివాసరావు, మట్టపల్లి సైదులుగౌడ్, చార్లెస్, మాజీ సర్పంచ్ వీరయ్య, నాయకులు వెంకయ్య, పల్లపు శ్రీను, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. చింతలపాలెం మండలం చింత్రియాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పేరుపంగు కిరణ్ బాబు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతారెడ్డి సైదిరెడ్డి, పి.ఏసమ్మ, నర్సింహారావు, వెంకటరెడ్డి, ఎం.బస్విరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ రాజకీయాలను రూపుమాపాలి

అనంతగిరి : అవినీతి, కుటుంబ రాజకీయాలను రూపుమాపాలని డాక్టర్ మల్లెబోయిన అంజియాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోండ్రియాలలో 'మన ఊరుకు.. మన వాడకు.. మన గడపకు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకు తిరిగి ప్రజలతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కోదాడ నియోజకవర్గంలో నూతన రాజకీయాలను నాంది పలకలని ప్రజలను కోరారు. దేశినేని రాజశేఖర్ నాయుడు, కమలాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో వంద అడ్మిషన్లు



100వ అడ్మిషన్ అందజేస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

చిలుకూరు : చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం వివిధ తరగతుల్లో 100 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో 100వ అడ్మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనదిస్తుండడంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయన్నారు. ప్రతి ఏడాది తమ పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు విద్యార్థులు ఎంపిక కావడానికితోడు గత ఏడాది టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని, వీటికితోడు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వీటి కారణంగా చిలుకూరుతో పాటు చుట్టపక్కల గ్రామాల వారు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రఫి, ఉపాధ్యాయులు రామిరెడ్డి, రామారావు, ఆదినారాయణ, రవికుమార్, శాంసన్, జానిమియా, ఖలీల్, శైనాష్, నిర్మల, శైలజ, పద్మావతి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష

కోదాడ : రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష కోరారు. శుక్రవారం పట్టణ పరిధిలోని శ్రీరంగాపురంలో జరిగిన సమభావన సంఘం మహిళల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు శ్రీనిధి, ముద్ర రుణాలను తీసుకొని వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన మహిళలను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, వనపర్తి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

కోదాడ : పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 31వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని శివారు కాలనీలకు తాగునీటి సమస్య ఉందని ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తిపిరిశెట్టి సుశీల, పెండెం వెంకటేశ్వర్లు, తిపిరిశెట్టి రాజు, రామినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న నాగండ్ల శ్రీధర్‌బాబు

నేరేడుచర్ల : లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ధాన్యం వ్యాపారస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారస్తులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సమావేశంలో వ్యాపారస్తులు భువనగిరి అంజయ్య, గుండా సత్యనారాయణ, శేఖర్, మోహన్, చారి, రాము, వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి సోని, సూపర్‌వైజర్ అనిల్ తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ, నాయకులు

హుజూర్‌నగర్ : సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ (తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్) జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.అంజయ్య, కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో అధికారులతో కలిసి పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్ర ఈ నెల 16న జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రారంభమై 18న సూర్యాపేట జిల్లాకు వస్తుందని తెలిపారు. సభ్యులు అధిక సంఖ్యలో యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో డీటీ సుధారాణి, సీనియర్ అసిస్టెంట్లు సుశీల, శ్రీనివాస్, నాగరాజు, ఎస్‌ఐ హరికృష్ణ, ఏఎస్‌ఐ లింగారెడ్డి, యూనియన్ నాయకులు పవన్, సత్యనారాయణ, రాజేష్, నర్సింహారావు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం పేదలందరికీ వర్తింపజేయాలి



మఠంపల్లి : తహసీల్దార్ సాయాగౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గరిడేపల్లి : గృహలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు దోసపాటి భిక్షం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి అర్హులైన పేదలను గుర్తించి డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. పేదలందరికీ ఇళ్లు ఇస్తామని చెప్పి గృహలక్ష్మి పథకం కింద భూమి ఉన్న వారికి మూడు లక్షలు ఇస్తామనడం విడ్డురంగా ఉందన్నారు. ప్రభుత్వానికి పేదలపై చిత్తశుద్ధి ఉంటే డబుల్ ఇళ్లకు అయ్యే ఖర్చు చెల్లించాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, అర్జున్, భిక్షం, వెంకటేశ్వర్లు, నాగయ్య, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు

వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యం కల్పించాలి

మఠంపల్లి : ప్రభుత్వం అమలు చేయనున్న గృహలక్ష్మి పథకంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలకు ప్రాధాన్యం కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. ఈమేరకు గురువారం ఆ సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ సాయాగౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత బంధులాగా రాజకీయ జోక్యం లేకుండా గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పున్నయ్య, దాసర్ల దుర్గమ్మ, రమణమ్మ, విజయ, షమీమ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



కోదాడరూరల్ : గుడిబండ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



హుజూర్‌నగర్‌రూరల్ : అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మునగాల : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోట గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోట గోపి కేవీపీఎస్ పక్షాన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 51 మూలంగా కార్మికులపై తీవ్రమైన పనిభారం పడుతుందన్నారు. కార్మికులు విధుల్లో లేకపోవడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని, సర్పంచ్‌లు చేస్తున్న తీర్మానాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అలాగే సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం మద్దతు తెలిపి మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఎనిమిది గంటల పనిదినాన్ని అమలుచేయాలని, ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.పది లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, సీఐటీయూ మండల నాయకులు బచ్చలకూరి స్వరాజ్యం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గ ర్వమ్మ, మండల అధ్యక్షుడు నాగార్జున, కార్మికులు చ ంద్రశేఖర్, పరుషరామ్, బజార్, వెంకటయ్య, సైదమ్మ, నాగమ్మ, సాగర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

నడిగూడెం : గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కేవీపీఎస్ నాయకుడు కోట గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సమ్మెలో భాగంగా ఉత్తమ్ యువసేన ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కరివిరాల గ్రామ సర్పంచ్ గుర్ర నీలిమా గాంధీ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, మహిళా విభాగం నాయకురాలు వేపూరి తిరుపమ్మ, వేల్పుల సోమయ్య, సీఐటీయూ మండల అధ్యక్షుడు మల్లెల వెంకన్న పాల్గొన్నారు.

మఠంపల్లి : గ్రామ పంచాయతీలలో ఏళ్లతరబడి నామమాత్రపు వేతనాలతో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కమిటీల సభ్యులు దూళిపాళ ధనుంజయ నాయుడు, భూక్యా పాండునాయక్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సమ్మె చేస్తున్న పంచాయతీ సిబ్బందికి సంఘీభావం తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల మండల కార్యదర్శులు మాళోతు బాలునాయక్, అమరారపు పున్నయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, సీతమ్మ, రన్‌మియా, ఇంటి రవి, మైసయ్య, దేవదానం, నాగయ్య, సంతోష్, కోటేశ్వరి, గురువారెడ్డి, దుర్గమ్మ, రమణమ్మ, షమీమ్, తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ ఎదుట కార్మికుల ధర్నా

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా పంచాయతీ కార్యదర్శి బయటి వ్యక్తులతో పనులు చేయిస్తుండటంతో ఆ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు శుక్రవారం ధర్నాకు దిగారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని గత పది రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రైవేటు వ్యక్తులతో పనులు ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. అనంతరం గ్రామంలో పనులు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులను అడ్డుకున్నారు. అనంతరం ఎంపీపీ నివాసం వద్దకు వెళ్లి తమకు న్యాయం జరిగే వరకు పనులు చేయించవద్దని దండం పెట్టి వేడుకున్నారు. కార్యక్రమంలో ముత్తయ్య, కొండలు, శ్రీను, కరీం, ఉష, బాబు, సూరి, కవిత, లింగయ్య తదితరులు ఉన్నారు.

అర్ధనగ్న ప్రదర్శనతో కార్మికుల నిరసన

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ సిబ్బందితో కలిసి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేసి అనంతరం ఆయన మాట్లాడారు. గత తొమ్మిది రోజులుగా పంచాయతీ సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు అయిన లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషణబోయిన హుస్సేన్, జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు షేక్ హుసన్‌మియా, వీరారెడ్డి, కొండల్, రత్నం, అంజయ్య, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, అంజి, యల్లమ్మ, ఇందిరమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు యాకుబ్, సీతారాంరెడ్డి, పరమేష్, సందీప్, చాంద్, కృష్ణప్రసాద్, పిట్ట బాబు, జిలకర రామస్వామి, గోపి, రవి, రమేష్, సైదులు తదితరులు ఉన్నారు.



మఠంపల్లిలో ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ సిబ్బంది, సీపీఐ, సీపీఎం నాయకులు



మునగాలలో జీపీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

మహిళా ప్రజాప్రతినిధులపై వివక్ష



నడిగూడెం ఎంపీపీని పరామర్శిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

కోదాడ : అధికార పార్టీలోని మహిళా ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష చూపుతున్నారని, సొంత పార్టీ వారే అడుగడుగునా అవమానిస్తున్నారని ఆ పార్టీకి చెందిన పలువురు మహిళా ప్రజాప్రతినిధులు ఆరోపించారు. శుక్రవారం నడిగూడెం ఎంపీపీ యాతాకుల జ్యోతి నివాసంలో ఆమెను వారు పరామర్శించి మాట్లాడారు. గురువారం నడిగూడెంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో రెండు గంటల ముందు వెళ్లినప్పటికీ ఎంపీపీకి సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమం పూర్తి చేసి తీవ్రంగా అవమానించారని అన్నారు. ఈ విషయాన్ని కేసీఆర్, కేటీఆర్‌తో పాటు మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో అనంతగిరి జెడ్పీటీసీ కొణతం ఉమ, బండ్ల ప్రశాంతి, బొలిశెట్టి శిరీష తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సైదిరెడ్డితో మాట్లాడుతున్న వీఓఏలు

హుజూర్‌నగర్ : సంఘ మిత్ర కార్యాలయంలో వసతులు కల్పించాలని వీఓఏలు కోరారు. శుక్రవారం మండలంలోని వీఓఏలు జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘ మిత్ర కార్యాలయానికి మండలం నుంచి నిత్యం మహిళలు వస్తుంటారని తెలిపారు. అక్కడ వారికి మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని తమ బాధ ఎవరికి చెప్పకోవాలో తెలియడం లేదని వాపోయారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. కలెక్టర్‌కు లేఖ రాశారు. కార్యక్రమంలో సంఘ మిత్ర కార్యాలయ సిబ్బంది, వీఓఏలు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటింటికీ హరితహారం మొక్కల పంపిణీ



అల్లీపురంలో మొక్కలు పంపిణీ చేస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది

మఠంపల్లి : ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీడీఓ జానకిరాములు అన్నారు. గురువారం మండలంలోని అల్లీపురం, కొత్తతండా, కామంచికుంటతండా తదితర గ్రామపంచాయతీలలో తొమ్మిదవ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీని పర్యవేక్షించి మాట్లాడారు. మండలంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోలపూడి వెంకయ్య, ధారావత్ సునీతాలాలూనాయక్, మాళోతు సుజాతాసక్రునాయక్, కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.